క్లుప్తంగా

200 మందికి వైద్యసేవలు



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని రాయల్ హాస్పిటల్స్ గైనకాలజిస్ట్ డాక్టర్ బిందు అన్నారు. కాతేరు పాత పంచాయతీ ఆవరణలో ఆదివారం కాతేరు యూత్ సర్కిల్ సహకారంతో రాయల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి పైగా రోగులను వైద్యసేవలు అందించారు. బీపీ, షుగర్ పరీక్షలు జరిపారు. అన్ని రకాల వ్యాధులకు వైద్య చికిత్స అందించారు. డాక్టర్ శివ, క్యాంప్ కో ఆర్డినేటర్ ఓ.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

75 మంది రక్తదానం



రక్తదాతలను అభినందిస్తున్న అనుశ్రీ సత్యనారాయణ, ఏడిద బాబీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో స్థానిక ధన్వంతర బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని అనుశ్రీ ఫిలింస్ అధినేత, జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ప్రారంభించారు. శిబిరంలో 75 మంది రక్తదానం చేశారని ఏడిద బాబీ తెలిపారు.

దేశాభివృద్ధికి రోల్ మోడల్ రాజీవ్ గాంధీ



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: దేశాభివృద్ధికి రోల్ మోడల్ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని పీసీసీ సభ్యుడు, రాజమహేంద్రవరం నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కృష్ణా నగర్ కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. జాంపేట వంతెన వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాటం రవి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు బిల్డర్ బాబీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

కడియం: స్థానిక దేవీచౌక్ సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పుష్పాంజలి ఘటించారు. తాడాల కొండ్రాజు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే మునకే..



కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నిలిచిన నీరు

రాజానగరం: దివాన్ చెరువు కూడలి నుంచి శ్రీరామపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు చినుకు పడితే చాలు మునిగిపోతోంది. ఎంతోకాలంగా ఈ సమస్య ఉంది. ఇటీవల ఈ రోడ్డును ఎత్తు చేసి, సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఇరువైపులా డ్రైనేజీలు కూడా నిర్మించారు. అయితే నిర్మాణంలో నీరు వెళ్లే మార్గాలు సరిగ్గా చూడకపోవడంతో కొద్దిపాటి వర్షానికే రోడ్డు జలమయమై ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి, ముంపు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహిళల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమానికి టీడీపీ ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆదివారం స్థానిక 18వ డివిజన్‌లో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు డివిజన్‌లో ప్రతి ఇంటికీ వెళ్లి మహాశక్తి పథకాలను వివరించారు.

శాంతి కోసం ప్రార్థనలు

మధురపూడి: మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ ఫాదర్ మాణిక్యం ఆధ్వర్యంలో ఆదివారం కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఉపదేశి బెల్లపు డేవిడ్, సంఘ పెద్దలు బూసి మేరీకాంతం, థామస్, వరమ్మ, జోస్పిన్ పాల్గొన్నారు.

శ్రావణం.. శోభాయమానం..

- నగరంలో ఆధ్యాత్మిక సందడి
- ఘాట్లలో భక్తుల పుణ్యస్నానాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నగరంలోని పుష్కర ఘాట్



శుభ్రంగా తయారైన కోటిలింగాలరేవు

సీటీఆర్ఐ: నగరంలో శ్రావణ శోభ మొదలైంది. గురువారం నుంచి శ్రావణ మాసం ప్రారంభమైన నేపథ్యంలో గోదావరి ఘాట్లు, ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. భక్తులు రేవుల్లో పుణ్యస్నానాలు ఆచరించి, సమీపంలోని ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. శ్రావణ మాసం సందర్భంగా గోదావరి ఘాట్‌లను నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశాలతో ముందుగానే శుభ్రం చేయించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వర్షాలు పడుతుండటంతో బురద ఏర్పడకుండా, ఘాట్లలో స్నానమాచరించడానికి వచ్చేవారు జారి పడకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు.

పుణ్యస్నానాలకు ఘాట్లు సిద్ధం

శ్రావణ మాసం సందర్భంగా భక్తులు, మహిళలు పుణ్యస్నానాలు ఆచరించడానికి గోదావరి ఘాట్లను సిద్ధం చేశారు. కోటిలింగాల, పుష్కర, సరస్వతి, గౌతమి, వీఐపీ తదితర ఘాట్లలో అన్ని వసతులు కల్పించారు. తెల్లవారుజామున స్నానాలకు వచ్చే వారికోసం విద్యుత్ దీపాలు అమర్చారు. అలాగే పిల్లలు, వృద్ధుల కోసం పుష్కర ఘాట్‌లో జల్లు స్నానానికి ఏర్పాట్లు చేశారు.

వ్యాపారుల్లో నూతనోత్సాహం

శ్రావణ మాసం సందర్భంగా వ్యాపారుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఈ ఏడాది ఆషాఢం తర్వాత అధిక శ్రావణం రావడంతో రెండు నెలలుగా వ్యాపారాలు నత్తనడకన సాగాయి. ఇప్పుడు పూలు, పండ్లు, ఇతర వస్తువుల అమ్మకాలు జోరందుకుంటున్నాయి. వరలక్ష్మి వ్రతంతో పాటు ప్రతి శ్రావణ శుక్ర, మంగళ వారాల్లో మహిళలు ప్రత్యేక పూజలు ఆచరిస్తారు. దీంతో వస్త్ర దుకాణాలు కళకళలాడనున్నాయి. బంగారం వ్యాపారాలు కూడా ఊపందుకుంటాయి. శ్రావణ మాసంలో బంగారు రూపులు, ఇతర వెండి వస్తువులు కొనుగోలు చేయడానికి మహిళలు ఆసక్తి చూపుతారు. అలాగే పూజల నేపథ్యంలో పువ్వులకు డిమాండ్ బాగా పెరుగుతోంది. పూల ధరలు ఆకాశాన్నంటాయి.

25న వరలక్ష్మి వ్రతం

శ్రావణ మాసంలోని రెండో శుక్రవారం తెలుగు మహిళలు వరలక్ష్మి వ్రతం ఆచరించడం సంప్రదాయం. ఈ ఏడాది వరలక్ష్మి వ్రతం ఆగస్టు 25న వచ్చింది. మహిళలు ఇంట్లో ఉదయం వ్రతాలు ఆచరించి, సాయంత్రం అమ్మవారి ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. శుక్రవారం భక్తుల రద్దీని దృష్టిలో ఇప్పటి నుంచే ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. దేవీచౌక్‌లోని బాలా త్రిపుర సుందరి దేవి, వంకాయలవారి వీధిలోని వరలక్ష్మి, అష్టలక్ష్మీ దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు.

ఏపీఎన్జీవో మహాసభలకు ఉద్యోగుల పయనం



వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న వేణుమాధవరావు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మహాసభలకు నగరం నుంచి పలువురు ఉద్యోగులు ఆదివారం సొంత వాహనాల్లో బయలుదేరారు. స్థానిక ఎన్జీవో హోం నుంచి బయలుదేరిన వాహనాలను రాష్ట్ర జేఏసీ కార్యదర్శి డి.వేణుమాధవరావు జెండా ఊపి ప్రారంభించారు. నగరం నుంచి నాలుగు బస్సులు, 25 కార్లలో చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరుతున్నట్లు వేణుమాధవరావు తెలిపారు. మహాసభల్లో ఉద్యోగులకు సంబంధించిన పలు డిమాండ్లను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకు వెళతామన్నారు. నగర ఎన్జీవో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్ కుమార్, సహ అధ్యక్షుడు అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు ఎం.మాధవరావు, ప్రతాప్, నాగ శ్రీనివాస్, సత్యమూర్తి, కాంటాక్ట్ ఉద్యోగ సంఘ నాయకులు చటర్జీ, జిల్లా డీసీ మెంబర్ రాజు, ఈఎస్ఐ నాగేశ్వరరావు, కరీంవలీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు సేవలు చిరస్మరణీయం



సుబ్బారావు విగ్రహానికి నమస్కరిస్తున్న గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: కార్మిక నాయకుడు చొల్లంగి సుబ్బారావు కార్మిక సంక్షేమానికి విశేష కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. లాలాచెరువు జంక్షన్‌లోని చొల్లంగి సుబ్బారావు విగ్రహం వద్ద ఆదివారం ఆయన జయంత్యుత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సుబ్బారావు బర్మా కాలనీ, స్పిన్నింగ్ మిల్లు కాలనీలు ఆయన కృషితోనే ఏర్పడ్డాయన్నారు. 25 ఎకరాల భూమిని సేకరించి ఆ రోజుల్లోనే స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు కాలనీలు ఏర్పాటు చేశారన్నారు. 1987లో దివంగతులైన ఆయన విగ్రహాన్ని 1988లో ఏర్పాటు చేసి, ఏటా జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారన్నారు. మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధర్, రాయుడు శ్రీను, చొల్లంగి రామలక్ష్మి, చొల్లంగి శ్రీను, కాండ్రేగుల త్రిమూర్తులు, కాకి సూరిబాబు, కాదా సత్యనారాయణ, పెంకే సురేష్ పాల్గొన్నారు.

ఆవులు కనిపించడం లేదంటూ రైతుల ఆందోళన



కాతేరు మల్లయ్యపేటలో ధర్నా చేస్తున్న పాడి రైతులు

రాజమహేంద్రవరం రూరల్: నగరపాలక సంస్థ అధికారులు గోశాలకు తరలిస్తున్న ఆవుల్లో కొన్ని కనిపించడం లేదని పాడి రైతులు ఆందోళన చేపట్టారు. దీనికి అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కాతేరు మల్లయ్యపేట వద్ద ధర్నా చేశారు. పాడి రైతులు మాట్లాడుతూ గోసంరక్షణ పేరుతో ఆవులను హింసిస్తున్నారని మండిపడ్డారు. తమకు ఎంత పాడిఉన్నా హిందూ సంప్రదాయం ప్రకారం ఆవులను ఎంతో ప్రేమగా పెంచుకుంటామన్నారు. గృహ ప్రవేశాలకు, దహన కార్యక్రమాలకు ఆవు పిడకలు అమ్ముకుని జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఉమా కోటిలింగేశ్వర స్వామి క్షేత్రంలో పూజలు, పిండ ప్రదానాల కోసం భక్తుల కోరిక మేరకు ఆవులను ఆ క్షేత్రంలో వదిలేస్తామని తెలిపారు. ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, దూర ప్రాంతాల్లోని గోశాలకు తరలిస్తున్నారని, వాటిని తీసుకు రావడానికి రవాణా ఖర్చులుగా రూ.వేలు చెల్లించాల్సి వస్తోందన్నారు. అలాగే గోశాలకు తరలించిన ఆవుల్లో కొన్ని కనిపించడం లేదని ఆరోపించారు. అధికారులను అడిగితే తమను బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో రెడ్డి శ్రీనివాస్, జేవీ గిరిధర్, ఇ.సత్యనారాయణ, ఎ.సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి తనిఖీ

అనపర్తి: స్థానిక ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయకర్త డాక్టర్ ఎం.సనత్ కుమారి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు పొందిన రోగుల వివరాలను అడిగి తెలుసుకున్న డీసీహెచ్ఎస్ ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో రోగుల వివరాలను అప్‌లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ విషన్ అమలు తీరు, ఆసుపత్రిలో శానిటైజేషన్‌ను పరిశీలించిన ఆమె పారిశుధ్యం విషయంలో మరింత శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగురెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా హ్యాపీ స్ట్రీట్



డ్యాన్స్ చేస్తున్న యువత



చదరంగం ఆడుతున్న నగర వాసులు

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాపీ స్ట్రీట్ కార్యక్రమం నగర వాసులను ఎంతో ఆకట్టుకుంటోంది. జేఎన్ రోడ్డులోని ఏకేసీ కాలేజీ సమీపంలోని పరమహంస యోగానంద మార్గ్‌లో ప్రతి ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ ఈ కార్యక్రమం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లో నగర ప్రజలు ఉల్లాసంగా పాల్గొంటున్నారు. డ్యాన్సులతో చిన్నారులు హుషారెత్తిస్తున్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై ఉక్కుపాదం

- పోలీసుల ప్రత్యేక కార్యాచరణ
- ఎక్కడికక్కడ తనిఖీలు
- పట్టుబడిన వారికి కౌన్సెలింగ్
- వాహన యజమానులపై కేసులు



మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కంబాలచెరువు: డ్రైవింగ్‌పై అవగాహన లేకుండా, మానసిక పరిపక్వత లేని వయసులో చిన్నారులు వాహనాలు నడిపితే జరిగే తప్పిదాలకు భారీ మూల్యం చెల్లించుకోవాలి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో మైనర్లు వాహనాలు నడిపిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు రాజమహేంద్రవరం ట్రాఫిక్ పోలీసులు నడుం బిగించారు. మైనర్ల డ్రైవింగ్‌ను పూర్తిగా నియంత్రించేందుకు కార్యాచరణ రూపొందించారు.

వాహన యజమానులపై కేసులు

నగరంలో వివిధ పనుల నిమిత్తం నిత్యం రహదారిపై మనం రాకపోకలు సాగిస్తుంటాం. మన కళ్ల ముందే మన పక్కన అకస్మాత్తుగా పెద్దశబ్దంతో రయ్‌మని, ర్యాష్‌గా దూసుకువెళ్లే ద్విచక్ర వాహనాల కారణంగా ఇబ్బంది పడుతున్నాం. ఇటువంటి బాధ్యతలేని డ్రైవింగ్‌ను ఎక్కువగా మైనర్లే చేస్తున్నారు. వారి అవగాహన లేని డ్రైవింగ్ కారణంగా రహదారి ప్రమాదాలు ఎక్కువగా చోటు జరుగుతున్నాయి. డ్రైవింగ్ చేసే వయసు రాకుండా, లైసెన్సు లేకుండా మైనర్లు వాహనాలు నడిపారంటే ఆ తప్పిదానికి కారణం వారి తల్లిదండ్రులే అని పోలీసులు చెబుతున్నారు. చిన్నారుల ఆనందం కోసం వారి ద్విచక్ర వాహనం ఇస్తూ పరోక్షంగా వారి బంగారు భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. ఇటువంటి సందర్భాల్లో ప్రమాదాలు జరిగితే వాహన యజమానులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు.

మైనర్లకు వాహనం ఇవ్వడం నేరం

ప్రమాదం జరిగిన తరువాత వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం కన్నా ప్రమాదాలు జరగకుండా ముందుగానే అడ్డుకట్ట వేయడం ప్రధానమని, మైనర్లు వాహనాలు నడపకుండా నియంత్రించడం ముఖ్యమని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అందుకోసం స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టారు. విస్తృతంగా వాహనాల తనిఖీలు చేస్తూ డ్రైవింగ్‌లో పట్టు బడిన మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆయా వాహనాలు స్వాధీనం చేసుకుని, వాటి యజమానులను, మైనర్ల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి వారికి కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మరోసారి వారికి వాహనం ఇవ్వకుండా హామీ పత్రం రాయించుకుంటున్నారు.

> **చర్యలు తప్పవు**
>
> మైనర్లకు వాహనాలిస్తే ఇచ్చిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం. దీనిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. తనిఖీల్లో దొరికిన వారిని పట్టుకుని కౌన్సెలింగ్ ఇస్తున్నాం. పిల్లలకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. చాలామంది యువత డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్నారు. వారిపైనా ప్రత్యేక దృష్టి సారించాం. రోడ్డు నిబంధనలు పాటించి ప్రతి ఒక్కరూ సురక్షిత డ్రైవింగ్ చేయాలి.
>
> – ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ, రాజమహేంద్రవరం

ఇక పెయ్య దూడలే పుడతాయి!

- లింగ నిర్ధారణ వీర్య పథకం అమలు
- 300 పశువులకు కృత్రిమ గర్భధారణ
- 90 శాతం విజయవంతం



ప్రయోగంతో పుట్టిన మేలు జాతి పెయ్య దూడ

నల్లజర్ల: కృత్రిమ గర్భధారణతో పశు సంతతిని వృద్ధి చేసే విధానం ఇప్పటి వరకూ అమలులో ఉంది. ఈ పద్ధతిలో గిత్తలు లేదా దున్నల నుంచి సేకరించిన వీర్యాన్ని నేరుగా ఆవులు లేదా పశువులకు ఇంజెక్ట్ చేస్తారు. ఇలాంటపుడు గిత్త లేదా ఆవు దూడలు, పోతు లేదా పెయ్య దూడలు పుట్టేవి. అయితే పాల ఉత్పత్తి పెంచే ఉద్దేశంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకు వచ్చింది. తెలుపు, నలుపు జాతి పశువులు రెండింటికీ ఈ పథకం వర్తిస్తుంది. చూడి పశువులకు ఇకపై పెయ్య (ఆడ దూడ)లే పుట్టేలా లింగ నిర్ధారణ వీర్య పథకం (సెక్స్ సార్టెడ్ సెమన్) అమల్లోకి తీసుకువచ్చారు. ఈ విధానంతో మేలైన గేదెల సంఖ్యను పెంచి, దేశంలో క్షీర విప్లవానికి నాంది పలుకుతారని భావిస్తున్నారు. ఈ కొత్త పథకం అమలులోకి వస్తే పాల ఉత్పత్తి పెంపుదలకే గాకుండా పాడి రైతులకు ఆర్థిక పరిపుష్టి కలిగిస్తుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

సబ్సిడీపై ఇంజక్షన్

లింగ నిర్ధారణ వీర్య పథకంలో ఒక్కో ఇంజక్షన్ వాస్తవ రేటు రూ.1350. అయితే ఈ మొత్తంలో ప్రభుత్వ సబ్సిడీ రూ.850 ఉంటుంది. రైతు కేవలం రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. పశువు ఎదకు వచ్చిన 20 నుంచి 40 రోజుల వ్యవధిలో పశు పోషకులు పశువైద్యులను సంప్రదిస్తే గేదెకు ఇంజక్షన్ ఇస్తారు. మొదటి సారి చూడి కట్టకపోతే రెండోసారి మళ్లీ ఇంజక్షన్ ఇస్తారు. అదీ విఫలమైతే రైతు చెల్లించిన రూ.500లో సగం రూ.250 రైతు ఖాతాకు జమ చేస్తారు. ఈ పథకం ప్రయోగాత్మకంగా ఇప్పటికే విజయవంతమైంది. దాంతో ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. దీనిని మరింత విస్తరించేలా పశుసంవర్ధక శాఖ ఏడీలు, పశువైద్యులకు శిక్షణ కూడా ఇచ్చారు.

అమ్మవారి సన్నిధి .. అభివృద్ధి సవ్వడి

- రూ.2.14 కోట్లతో భక్తులకు మెరుగైన వసతులు
- అదనపు గదుల నిర్మాణం
- పక్కా భవనాలతో షాపింగ్ కాంప్లెక్స్
- ఏటా రూ.3 కోట్ల ఆదాయం



కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం

నిడదవోలు: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న భక్తుల పాలిట కొంగు బంగారంగా కోట సత్తెమ్మ అమ్మవారు విరాజిల్లుతున్నారు. ఎంతో ఖ్యాతికెక్కిన ఈ ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచీ భక్తులు తరలి వస్తారు. అమ్మవారి దర్శనానికి ఉమ్మడి ఉభయ గోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, కృష్ణా, గుంటూరు తదితర జిల్లాల నుంచి ఏటా సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల మంది భక్తులు వస్తుంటారు. ప్రతి ఆది, మంగళవారాల్లో సుమారు 30 వేల మంది అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ దేవస్థానానికి ఏటా రూ.3 కోట్ల ఆదాయం వస్తుంది. పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు మెరుగైన వసతులు కల్పించడానికి ప్రత్యేక దృష్టి సారించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు కృషితో రూ.2.14 కోట్ల వ్యయంతో భక్తులకు అదనపు గదులు, మరుగుదొడ్లు, శాశ్వత అన్నదాన ట్రస్టుకు పక్కా భవనాలు అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు కలిసి వాటికి ప్రారంభించారు. అమ్మవారి ఆలయంలో పాత షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించారు. రాజగోపురం ఎదురుగా ప్రస్తుతం రూ.32 లక్షల వ్యయంతో పక్కా భవనాలతో కూడిన ఏడు షాపులను నిర్మించి ప్రారంభించారు. ఆలయంలో పాత షాపింగ్ కాంప్లెక్స్, ప్రహరీ తొలగించడంతో భక్తుల వాహనాల పార్కింగ్‌కు విశాలమైన స్థలం సమకూరింది. భక్తుల వసతి నిమిత్తం గతంలో 40 పాత రేకుల షెడ్డులు ఉండేవి. వాటిని తొలగించి ఆ స్థానంలో రూ.1.60 కోట్ల వ్యయంతో శ్రీ కోట సత్తెమ్మ సదన్ భవనం, కోటసత్తెమ్మ శాశ్వత అన్నదాన ట్రస్టు భవనాన్ని నిర్మించారు. అంతేగాకుండా భక్తుల సౌకర్యార్థం సుమారు వంద మందికి సరిపడా ఏసీ హాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని అద్దె రోజుకు రూ.4,800 నిర్ణయించారు. సుమారు 200 మంది ఒకేసారి కూర్చుని భోజనం చేయడానికి అనువుగా అన్నదానం భవనాన్ని నిర్మించారు. ఇక్కడ భక్తులు కూర్చోవడానికి వీలుగా స్టీల్‌తో చేసిన టేబుల్స్, కుర్చీలు అందుబాటులో ఉంచారు. ఏటా అమ్మవారి దర్శనానికి రాష్ట్ర నలుమూలాల నుంచి సుమారు పది లక్షల మంది భక్తులు వస్తుంటారు. వారికి మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.22 లక్షల వ్యయంతో మరుగుదొడ్ల బ్లాక్ నిర్మాణాలు చేపట్టారు. ఆ పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి.

నేడు కుంకుమ పూజలు

రాజానగరం: ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధిని కోరుకుంటూ స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దంపతుల ఆధ్వర్యంలో వేలాది జంటలు కుంకుమ పూజలు నిర్వహించనున్నాయి. సోమవారం ఉదయం 6.30 గంటలకు నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో కొలువైన జగన్మాత ఆలయాల్లో ఈ పూజలు జరుగుతాయి. పార్టీ నాయకులు, అభిమానులు జంటలుగా ఆయా గ్రామాల్లోని ఆలయాలలో అమ్మవార్లకు కుంకుమ పూజలు చేస్తారు. జాతీయ రహదారిపై సూర్యారావుపేట జంక్షన్‌లోని కనక దుర్గమ్మ ఆలయం వద్ద ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

రోడ్డు పనులలో విగ్రహాల తొలగింపు

సీతానగరం: రాజమహేంద్రవరం రూరల్ కాతేరు నుంచి సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డు నాలుగు లైన్ల విస్తరణ పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న విగ్రహాలను అధికారులు తొలగిస్తున్నారు. వీటికి స్థానికులు, వివిధ పార్టీల నాయకులు సహకరిస్తుండడంతో ఈ కార్యక్రమం సజావుగా సాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో విగ్రహాల చేతులు విరిగిపోవడంతో వాటిని ఆర్‌అండ్‌బీ అధికారులు సరిచేసి ఇస్తామని చెప్పారు. అంబేడ్కర్, ఎన్టీఆర్, రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ, స్థానిక నాయకులు, ప్రముఖుల విగ్రహాలు రోడ్డు ఇరువైపులా సుమారు 18 వరకూ ఉన్నాయి. ముందుగా ఆర్‌అండ్‌బీ అధికారులు ఆ విగ్రహాలకు సంబంధించిన కమిటీలతో సంప్రదించి తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం శివారున పామాయిల్ తోటలో పేకాటాడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై కె.చిరంజీవి ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.3,490 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.